సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



లోక్ అదాలత్ ద్వారానే కేసులకు పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ ద్వారానే కేసులకు పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. - 8లో



కూటమి నేతల కనుసన్నల్లో అధికార యంత్రాంగం

పోలీసు, రెవెన్యూ సిబ్బంది కూటమి నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. - 8లో

గరిష్టం/కనిష్టం **28.8 /23.6**

వాతావరణం

జిల్లాలో శనివారం 23.6 - 28.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.53 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సాక్షి టీవీ జర్నలిస్టులకు పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : సాగునీటి సంఘ ఎన్నికలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన సాక్షి టీవీ ప్రతినిధులపై వేముల ఎమ్మార్వో కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శనివారం వారు సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్ వెన్ను, వీడియో జర్నలిస్ట్ రాములను వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి విలేకరులపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లాలో ఇలాంటి సంస్కృతి ఎన్నడూ లేదన్నారు. టీడీపీ నేతలకు త్వరలోనే బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య, కార్పొరేటర్లు రామ్ లక్ష్మణ్ రెడ్డి, అజ్మతుల్లా, ఐస్ క్రీమ్ రవి, నాయకులు దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత అవగాహన సదస్సు

కడప అర్బన్ : ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని ఎన్జీఓ భవనంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్‌లు తెలిపారు. నల్లబల్ల ద్వారా సిలబస్ అంశాల ప్రశ్నావళి, సర్వీసు నిబంధనలు, కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ రాసే విధానంలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. బిట్స్, బుక్‌లెట్‌లు, మోడల్ పేపర్లు, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ రాసే విధానం కరదీపిక అందుబాటులో ఉంటాయని తెలిపారు. సర్వీసు నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవచ్చని, ఇది డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసే వారి ఉత్తీర్ణతకు దోహదపడుతుందని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగ, ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు.

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ సభ్యులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

రాయచోటిటౌన్ : రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నమయ్య జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి ఎస్.కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. రాయచోటి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా మూడు బెంచ్‌ల ద్వారా 130 కేసులను పరిష్కరించారు. మొదటి బెంచ్‌లో న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి 18 కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ.1,11,64,823 అవార్డుగా అందించారు. రెండో బెంచ్ ద్వారా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న 4 కేసులు పరిష్కరించి కక్షిదారులకు రూ.30,35,000లు, మూడో బెంచ్ ద్వారా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీసీ ఆసీఫా సుల్తానా ఆధ్వర్యంలో 108 కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ.42,53,716 అవార్డు అందజేశారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యుడు బి.నరసింహారెడ్డి, న్యాయవాదులు యు. ధనుంజయ, ఏ. కుమార్‌రాజ్, ఎం. ఖాదర్‌బాషా, డి. నాగమునయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- ప్రభుత్వం చెప్పేదొకటి... ఇక్కడ నేతలు చేస్తున్నది మరొకటి
- అర్హులైన వారికి 'నో డ్యూస్' ఇవ్వకుండా టీడీపీ పన్నాగం
- వీఆర్వోలను కనిపించకుండా చేసి ప్రతిపక్షాలపై దౌర్జన్యం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కదలనివ్వని పోలీసులు
- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బహిష్కరించడంతో ఏకపక్షంగా ఎన్నికలు
- టీడీపీ నేతల మధ్య విబేధాలు.. పింఛా ప్రాజెక్టు ఎన్నికలో లాఠీఛార్జి
- ఎన్నికల నిర్వహణ తీరుపై విస్తుపోతున్న ప్రజాస్వామ్య వాదులు



పోలీసులు హౌస్ అరెస్టు చేయడంతో జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి కడప /సాక్షి రాయచోటి : ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఒక విశిష్ట గుర్తింపు ఉంటుంది. ఇరు పక్షాలు పోటీ చేయడం....ఓటర్లు తమ ఓటుహక్కు ద్వారా గెలుపోటములు నిర్దేశించడం వ్యవస్థలో పరిపాటి. కానీ అలా కాకుండా ప్రభుత్వం చెప్పేదొకటి...కూటమి నేతలు చేసేది మరొకటిగా మారింది. సాగునీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనాలంటే ఖచ్చితంగా నో డ్యూస్ సర్టిఫికెట్ ఉండాలనే నిబంధన పెట్టడం...కూటమి నేతలు ప్రతిపక్షాలకు ఇవ్వకుండా చేయడం లాంటి ద్వంద్వ నీతితో విమర్శల పాలయ్యారు. ఎక్కడ చూసినా ఏమున్నది గర్వకారణమన్నట్లు అన్నిచోట్లా బెదిరింపులు...దౌర్జన్యాలు....అధికార దుర్వినియోగం...వీఆర్వోలపై పచ్చరాజకీయం...ప్రతిపక్షాలను ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయడం తప్ప ఇంకోటి కనిపించలేదు. అన్నిచోట్లా తామే ఉండాలన్న లక్ష్యంతో ఇతరులను దరిదాపుల్లోకి రాకుండా దౌర్జన్యం, బెదిరింపులతో ఏకపక్షంగా సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు జరపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క రాష్ట్రంలో కూటమి సర్కార్ చేస్తున్న మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడంతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో దాదాపు అన్ని స్థానాలు ఏకగ్రీవంగా మలుచుకున్నారు.

అధికార దుర్వినియోగం

అధికార పార్టీ శ్రేణులు నాలుగు రోజులుగా సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికలపై దృష్టి సారించారు. ప్రధానంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకుని ఒక పథకం ప్రకారం వీఆర్వోల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయించడం, కొంతమందిని వారి రహస్యప్రాంతాలకు తరలించడం, కార్యాలయాల్లో పని పేరుతో పలకకుండా చేయడం వంటి చర్యలకు ఉపక్రమించారు. జమ్మలమడుగు నియోజకవర్గం పెద్ద ముడియం మండలానికి చెందిన కొంతమంది వీఆర్వోలను ఏకంగా దేవగుడికి తీసుకెళ్లి అక్కడే పెట్టుకుని సమయం ముగిసిన తర్వాత పంపించడం లాంటి చర్యలకు కూటమి శ్రేణులు తెర తీశాయి. పులివెందుల నియోజకవర్గంలోనూ ఇష్టానుసారంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. తహసీల్దార్ కార్యాలయాల వద్ద టీడీపీ శ్రేణులు ఒకటి, రెండు రోజులుగా మకాం వేసి ప్రతిపక్ష పార్టీలను రాకుండా చూసుకున్నారు. నయానో, భయానో వారే గెలవాలన్న లక్ష్యంతో బరి తెగించడం...పోలీసులను ఉపయోగించుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను స్టేషన్లకు తరలించడం లాంటి చర్యలతో ప్రజాస్వామ్యంలో ఎన్నిక కాస్త అపహాస్యంగా మారిందని పలువురు విశ్లేషిస్తున్నారు.

ఏకపక్ష ఎన్నికలు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఎన్నికలను కూటమి శ్రేణులు ఏకపక్షంగా జరుపుకున్నాయి. కూటమి నేతలు అప్రస్వామిక వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను బహిష్కరించడంతో ఇక అడిగే వారు లేరు కదా అని వారు అనుకున్నమేరకు నిర్వహించుకున్నారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ జిల్లాలో 205 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా, మెజార్టీ స్థానాలను కూటమి వర్గాలు ఏకగ్రీవం చేసుకున్నాయి. అన్నమయ్య జిల్లాలో 167 సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడగా, అందులోనూ మెజార్టీ స్థానాలను కూటమి వశపరుచుకోగా, వీరబల్లి మండలంలో ఒక స్థానానికి నామినేషన్లు దాఖలు కాలేదు. సుండుపల్లెలో పింఛా ప్రాజెక్టు సాగునీటి సంఘ ఎన్నిక వాయిదా పడింది.

పింఛా ప్రాజెక్టు ఎన్నికల్లో రగడ..

అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం పింఛా ప్రాజెక్టు సాగునీటి ఎన్నికకు సంబంధించి టీడీపీలో రెండు వర్గాల మధ్య రగడ నెలకొంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలసుబ్రమణ్యం వర్గాల మధ్య పోటీ అనివార్యమైంది. పోలింగ్ కేంద్రం వద్ద గుంపులుగా ఉన్న నేపథ్యంలో పంపించే ప్రయత్నంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఒకరినొకరు తోసుకుంటుండగా పోలీసులు ఎక్కడికక్కడ లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. రెండు వర్గాల మధ్య ఎప్పటినుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. అయితే ఎన్నికను ప్రస్తుతానికి వాయిదా వేశారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షించారు. అయితే అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ఎన్నికలు జరిగిన పరిస్థితులను చూసి రాజకీయ మేధావులు కూడా విస్తుపోతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏకపక్షంగా ఎన్నికలు గొడ్డలిపెట్టుగా మారాయని పలువురు పేర్కొంటున్నారు.

▶▶ కడప ఎంపీ హౌస్ అరెస్ట్..

పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న కూటమి అరాచకాలను అడ్డుకుంటూ ప్రతిపక్ష పార్టీ నేతలకు అండగా నిలుస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని బయటికి రానీయకుండా చేయాలని టీడీపీ నేతల ఒత్తిడితో పులివెందుల పోలీసులు కడప ఎంపీని కదనీయకుండా చేశారు. ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రక్రియ ముగిసేవరకు పోలీసులు ఆయనచుట్టే ఉన్నారు. శుక్రవారం కూడా వేముల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన విషయం అందరికీ తెలిసిందే. శనివారం కూడా ఎన్నికల నేపథ్యంలో బయటికి వెళ్లకుండా పోలీసులు కావాలనే ఉద్రిక్తత పేరుతో ఆయన్ను బయటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో కూడా ఏకపక్ష ఎన్నికల కోసం వీఆర్వోలను కనిపించకుండా చేసిన ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఫైర్ అయ్యారు. చివరకు సొంతూరులో అటు, ఇటు పక్షాలున్నా అధికారులు లేరని, ఇవేం ఎన్నికలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కూటమి నాయకులు ఏకగ్రీవం చేసుకోవడంలో భాగంగా ఇదంతా చేశారని ప్రజలు భావిస్తున్నారు.



సుండుపల్లె : రెండు వర్గాల కూటమి నేతల మధ్య వాగ్వాదం




సుండుపల్లె : ఎన్నికల కేంద్రంలో కూటమి నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నదియా దేవి



నిమ్మనపల్లె : దేవేందర్ రెడ్డి ఎన్నికపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే అసమ్మతి వర్గీయులను చెదరగొడుతున్న పోలీసులు

మాటలు.. నీటిమూటలు

- చెయ్యేరులో 'చెక్'డ్యాంల నిర్మాణంపై కదలిక లేదు
- వరదల సమయంలో వృథా అవుతున్న నీరు
- నాడు చంద్రబాబే... నేడు కూటమి సర్కారు సీఎం చంద్రబాబే
- అయినా మారని తీరు....



చెయ్యేరు నుంచి సోమశిలలోకి వెళుతున్న వరదనీరు

రాజంపేట : చెయ్యేరు నదిపై ఆనకట్టల నిర్మాణం ఎడారిలో ఒయాసిస్‌లా మారుతోంది. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వందలాది టీఎంసీలు నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయానికి చేరుతోంది. చెయ్యేరులో నీటి ప్రవాహం కొనసాగినా ఫలితం లేకుండాపోతోంది.నీరు నిల్వ ఉండడం లేదు.

జాడలేని నిపుణుల కమిటీ

గతంలో సీఎం చంద్రబాబునాయుడు చెయ్యేరులో వరదనీరు వృథాగా పోకూడదని, ఆనకట్టలకు సబంధించి నిపుణుల కమిటీని పంపిస్తామని..తద్వారా వరదనీరు వృథాకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటలు నీ టిమూటలు గానే మిగిలి పోయాయి. ఇప్పటి వరకు నిపుణుల కమిటీ జాడ కనిపించడంలేదు. వరదల సమయంలో ఏటిలో ప్రవహించే నీరు వృథాగా సోమశిల జలాశయంలో కలిసిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రెండున్నర దశాబ్దాలుగా చెక్‌డ్యాంల నిర్మాణంపై కదలికలేని దుస్థితి..నాడు సీఎంగా చంద్రబాబు..నేడు ఆయన సీఎంగా ఉన్నా ఫలితం శ్యూనమే.. వరదల సమయంలోనే నీటిని ఒడిసి పట్టుకోవాలి.తర్వాత చెక్‌డ్యాంల ద్వారా నీరు నిల్వ చేసుకుంటే భూగర్భజలాలు పెరుగుతాయని, కరువు బారినపడకుండా రైతులకు సాగునీరు..ప్రజలకు తాగునీరు పుష్కలంగా లభిస్తుందని నిపుణులు అంటున్నారు.

నిధులు ఏమయ్యాయో!

2001లో చెయ్యేరు, పెన్నా, గుంజన నదులకు లక్షల క్యూసెక్కులు వరద పొటెత్తింది. 30టీఎంసీలకుపైగా వరదనీరు వృథాగా పోయింది. నీటిని నిల్వ చేసుకునేందుకు సబ్ సర్ఫేస్ చెక్‌డ్యాం నిర్మించాలని అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశించారు. అప్పటి ఎమ్మెల్యే పసుపులేటి బ్రహ్మయ్య సీఎంను కలిసి ప్రతిపాదనలు ఇచ్చారు. 2.07.2002లో నాలుగు సర్ఫేస్ చెక్‌డ్యాంలు మంజూరు చేయాలని గ్రామీణాభివృది కమిషనర్‌ను ఆదేశించారు. సీఎం గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. 07.07.2003లో నాబార్డు అధికారులు, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదలశాఖ అధికారులు సమావేశమై హైలెవల్ మానిటరింగ్ కమిటీని తెరపైకి తీసుకొచ్చారు.ఈ కమిటీ పరిశీలన చేసి నివేదిక సమర్పించింది. దీంతో రాజంపేట, పెనగలూరు, నందలూరు మండలాల పరిధిలో ప్రవహించే చెయ్యేరు. గుంజన నదులపై నాలుగు సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణానికి ఆమోదం లభించింది. మైనర్ ఇరిగేషన్ సెక్టార్ కింద రూ.6.45కోట్లు నిధులు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ నిధులను ఏమయ్యాయో ఇప్పటి వరకు అంతుపట్టడంలేదు.

నీటిపారుదలశాఖ 55 చెక్‌డ్యామ్‌ల నిర్మించేందుకు ప్రాథమిక నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. అప్పట్లో నిపుణుల కమిటీని జిల్లాకు పంపి వరద నీటి గణాంకాలను పరిశీలించి చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిర్ణయం తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ విషయంలో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటామని బాబు వెల్లడించారు. గతంలో వచ్చిన నిధులను నీటిపారుదలశాఖ వినియోగించుకోకపోవడం వల్ల ఇప్పుడు వ్యయం మూడురెట్లు పెరిగిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబే. చెయ్యేరులో వృధాగా పోతున్న నీటిని చెక్‌డ్యాంల ద్వారా నీటినిల్వ చేస్తారా? బాబు మాటలు నీటిమూటలగానే మిగిలిపోనున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. చెక్‌డ్యాంల నిర్మిస్తే సాగు, తాగునీరు పెంపుదలకు దోహదపడుతుందని రైతులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మించాలి



చెయ్యేరులో లోలెవెల్ వంతెన స్థానంలో చెక్‌డ్యాం నిర్మించాలి. దీనివల్ల పాతరోడ్డు పునరుద్ధరణ జరిగినట్లవుతుంది. ఏరులో వరదనీరు వృథాగా పోకుండా నిల్వ చేసుకునే సౌకర్యం కలుగుతుంది. గుండ్లూరు–నీలిపల్లె మధ్య రోడ్డును పునరుద్దరించినట్లవుతుంది.
– భూమన శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచి, నాగిరెడ్డిపల్లె

చెయ్యేరులోని వరదనీరు వృథాగా పోతోంది



చెయ్యేరులో ప్రవహించే వరదనీరు సోమశిలలోకి వృథాగా పోతోంది. చెయ్యేరులో చెక్‌డ్యాంలు నిర్మితం చేయాలని ప్రస్తుత సీఎం చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు ప్రకటించారు. గుండ్లూరు–నీలపల్లె మధ్య ఉన్న లోలెవెల్ కాజ్‌వేను చెక్‌డ్యాంగా నిర్మిస్తే అటు చెయ్యేరు హైలెవెల్ వంతెనకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉంటుంది.
– ఆర్ముగం విశ్వనాథ్, ప్రధానకార్యదర్శి,సిటిజన్‌అసోసియేషన్

భావితరాల కోసం ఇంధన పొదుపు అవశ్యం
– జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, కార్పొరేషన్ : భావితరాల కోసం ఇంధన భద్రత, ఇంధన పొదుపు అవశ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపు చేయడంపై ప్రజల్లో అవగాహన కలిగించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి భాధ్యత అని తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి, శక్తిని పొదుపు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, శక్తిని పొదుపు చేయడం జీవితంలో భాగంగా చేసుకోవడానికి ఈ కార్యక్రమం ప్రేరణ ఇస్తుందని తెలిపారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజలలో అవగాహన కల్పించుటకు ప్రసంగాలు, ర్యాలీలు ,విద్యార్థులలో అవగాహన కలిగించుటకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు, వర్క్‌షాప్, వెబినార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భావి తరాల వారికి వెలుగులు అందిచడం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతతో విద్యుత్ పొదుపు చేయాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ, డీఈఈ మోహన్ పాల్గొన్నారు.

జ్యోతిక్షేత్రం.. భక్తజన సంద్రం



పూలతో అలంకరించిన కాశినాయన సమాధి

కాశినాయన : శ్రీఅవధూత కాశినాయన 29వ ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులతో జ్యోతిక్షేత్రం పోటెత్తింది. కాశినాయన నామస్మరణతో నల్లమల్ల కొండలు మారుమోగాయి. వివిధ జిల్లాల నుండి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసి కాశినాయన దర్శనం కల్పిస్తున్నారు. జ్యోతిక్షేత్రానికి చేరుకునేందుకు మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. దాదాపు రెండు లక్షల మంది భక్తులు ఆరాధనకు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తుల సంఖ్యకు ధీటుగా భోజన వసతి, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జ్యోతిక్షేత్రం భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అంతేకాకుండా భక్తులు స్వచ్ఛందంగా సుమోలు, ఆల్విన్, లారీలు, ఆటోల్లో వస్తున్నారు. మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిచ్చింది.



భక్తులతో కిక్కిరిసిన జ్యోతిక్షేత్రం



స్వచ్ఛందంగా భక్తులు సమర్పించిన కూరగాయలు

భారీ బందోబస్తు ..

ఆరాధన మహోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 150 మంది పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు..

కాశినాయన ఆరాధనకు భక్తులు స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు, నగదు సమర్పిస్తున్నారు. ఆరాధనకు అవసరమయ్యే బియ్యానికి రెట్టింపుతో ధాన్యాన్ని భక్తులు సమర్పించారు. కూరగాయలను సమర్పిస్తున్నారు. చాగలమర్రి, ఆళ్ళగడ్డ ప్రాంతాలకు చెందిన 200 మంది వంట మనుషులు రుచికరమైన వంటలు చేస్తున్నారు.

నేడు రథోత్సవం ..

ఆదివారం తెల్లవారుజామున 1 గంటకు కాశినాయన గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామోత్సవంలో కాశినాయన మాల ధరించిన భక్తులు పాల్గొంటారు. అనంతరం కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిస్తుంది. దీనిని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

క్లుప్తంగా

జిరాక్స్ సెంటర్‌లో దొంగతనం



జిరాక్స్ కేంద్రంపై కప్పు కత్తిరించిన దొంగలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నెరోడ్డులో మహేశ్వరరెడ్డికి చెందిన జిరాక్స్ సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. గుర్తు తెలియని దుండగలు అర్ధరాత్రి సమయంలో జిరాక్స్ సెంటర్ పై భాగంలో రేకల కప్పును కత్తిరించి లోపలికి దిగి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.60వేల నగదు, సెల్ ఫోను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



వెంకటరమణ నాయక్ మృతదేహం

సుండుపల్లె : పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందు కోసం పొలం చుట్టూ తీసిన విద్యుత్ తీగలు తగిలి మూడే వెంకటరమణ నాయక్ (42) అనే వ్యక్తి మృతి చెందాడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం మేరకు.. మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ, వావిళ్లవడ్డు బిడికి సమీపంలోని రెడ్డి చెరువు వద్ద చిన్నబిడికికి చెందిన పారామెడికల్ అధికారి బుక్కే రవినాయక్‌కు పొలం ఉంది. ఆ పొలంలో వేరుశనగ పంటను సాగుచేసిన ఆయన అడవి పందుల నుంచి రక్షణ కోసం పొలం చుట్టూ విద్యుత్ తీగలు వేశాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలుపలేదు. ఇదిలా ఉండగా పింఛా ప్రాజెక్టు నుంచి కాలువలకు నీరు విడుదల చేశారు. రెడ్డి చెరువులోకి నీళ్లు రావడంతో అక్కడ చేపలు పెంచుకుంటున్న మూడే వెంకటరమణ నాయక్ మరో ఇద్దరు వ్యక్తులు చెరువులో ఉన్న చేపలన్నీ ప్రాజెక్టులోకి వెళ్లిపోతాయేమోనన్న భయంతో చెరువు వద్దకు బయలుదేరారు. వీరు నడుచుకుంటూ వెళ్తుండగా విద్యుత్ తీగలు తగులుకుని వెంకటరమణ నాయక్ మృతి చెందాడు. కాగా సంఘటన జరిగిన సమయంలో పొలంలోనే ఉన్న యజమాని బుక్కే రవినాయక్ తనకు ఏమీ తెలియనట్లు హుటాహుటిన రాయచోటి వెళ్లి డ్యూటీలో ఉన్నట్లు ఆధారం సృష్టించుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతులకు అభయం.. దిగుబడులు భద్రం

- జిల్లాలో ఎంఐడీహెచ్ పథకం కింద రూ. 18.13 కోట్లు మంజూరు
- పలు రకాల గోడౌన్‌ల నిర్మాణానికి నిధులు
- రైతులకు వ్యక్తిగతంగా నిర్మించుకునే అవకాశం
- ఒక్కో దానికి 35 నుంచి 50 శాతం వరకు రాయితీ



గత ప్రభుత్వంలో ఎర్రగుంట్లలో ఏర్పాటు చేసిన వేర్‌హౌస్ బిల్డింగ్(ఫైల్)

కడప అగ్రికల్చర్ : రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటల దిగుబడిని చేతికొచ్చాక దాచుకునేందుకు సరైన వసతులు లేవు. ఈ కారణంగా గిట్టుబాటు ధర లేకున్నా అరకొర ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో చాలామంది రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటల దిగుబడులకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు తమ ధాన్యాన్ని భద్రంగా దాచుకునేందుకు వీలుగా ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకం(ఎంఐడీహెచ్) కింద జిల్లాకు రూ. 18.13 కోట్లు మంజూరు చేశాయి. ఇందులో భాగంగా పంట కోత అనంతరం యాజమాన్యం పథకంలో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, కోల్డ్ స్టోరేజీ, కోల్డ్ రూమ్స్, రైపెనింగ్ చాంబర్, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటర్స్‌ను మంజూరు చేసింది. వీటిని రైతులు వ్యక్తిగతంగా నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. ఆసక్తి ఉన్న రైతులు వీటిని నిర్మించుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్..

ఉద్యాన ఉత్పత్తులను శుభ్ర పరిచి, సైజుల వారీగా వేరు వేరుగా ప్యాక్ చేసి అవసరమైన చోట నాణ్యతను నిల్వ ఉంచేందుకు మైనపు పూత చేపించి దూర ప్రాంతపు మార్కెట్‌లకు ఎగుమతి చేసేందుకు ఉపయోగపడుతుంది.

■ ఇందులో 35 శాతం రాయితీలో 2 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించారు. ఒక్కో యూనిట్‌కు రూ. 17,50,000 రాయితీ ఇస్తారు.

కోల్డ్ స్టోరేజీ..

ఉద్యాన ఉత్పత్తులు నిల్వ చేసేందుకు తగిన తేమ, ఉష్ణోగ్రతలను నియంత్రించి , నిల్వ ఉండే తత్వాన్ని పెంపొందించి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించినప్పుడు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తారు. ఇందుకోసం మౌలిక వసతులు కల్పించేందుకు ఎండుమిరప, పసుపు, చింతపండు, ధనియాలు, ఇతర ధాన్యాలు నిల్వ కోసం ఉపయోగిస్తారు.

■ ఇందులో రెండు యూనిట్లను నిర్దేశించారు. 35 శాతం రాయితీలో గరిష్టంగా 10,000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ వరకు ఇస్తారు. యూనిట్ ధర 1 మెట్రిక్ టన్నుకు రూ. 8000, ఇందులో రూ. 2800 రాయితీ ఇస్తారు.

■ 1 యూనిట్‌కు రూ. 1.40 లక్షలు (5000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ వరకు) రాయితీ ఇస్తారు.

కోల్డ్ రూమ్స్..

35 శాతం రాయితీతో 8 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించారు. 187.5 మెట్రిక్ టన్నుల కెపాసిటీ వరకు ఇస్తారు.

■ యూనిట్ ధర 1 మెట్రిక్ టన్నుకు రూ. 8 వేలు ఇందులో రూ. 2800 రాయితీ ఇస్తారు.

■ 1 యూనిట్‌కు రూ. 5,25,000 రాయితీ ఇస్తారు.

రైపెనింగ్ చాంబర్..

■ పండ్లు మాగ బెట్టేందుకు (మామిడి, అరటి) ఉపయోగపడుతుంది. 35 శాతం రాయితీతో 1 యూనిట్ లక్ష్యంగా నిర్దేశించారు.

■ యూనిట్ ధర 1 మెట్రిక్ టన్నుకు రూ. 1,00,000

■ 1 మెట్రిక్ టన్నుకు రూ. 35 వేలు రాయితీ ఇస్తారు. 60 మెట్రిక్ టన్నుల కెపాసిటీ వరకు ఇస్తారు. దీనికి 1 యూనిట్‌కు రాయితీ రూ. 21,00,000 ఇస్తారు.

ఉల్లి నిల్వ గోదాములు..

■ ఉల్లి ధరల ఒడిదుడుకులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు కొంత కాలం నిల్వ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. 50 శాతం రాయితీతో 25 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉల్లి గోదాములను నిర్మించినట్లయితే రూ. 87,500 రాయితీ ఒక యూనిట్‌కు ఇస్తారు.

■ జిల్లావ్యాప్తంగా 60 యూనిట్‌లను లక్ష్యంగా నిర్దేశించారు.

కలెక్షన్ సెంటర్స్..

■ 40 శాతం రాయితీలో 6 లక్షల వరకు గరిష్టంగా ఇస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకంలో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, కోల్డ్ స్టోరేజీ, కోల్డ్ రూమ్స్, రైపెనింగ్ చాంబర్, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటర్స్‌ను మంజూరు చేసింది. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరింత సమాచారం కోసం సంబంధిత మండలాలలోని ఉద్యాన అధికారులను, లేదా జిల్లా ఉద్యానశాఖ కార్యాలయం వారిని సంప్రదించాలి.

– సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

కడప కేంద్ర కారాగారం సిబ్బంది మధ్య వాగ్వాదం

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో పనిచేస్తున్న సిబ్బందిలో కొంతమంది మధ్య వాగ్వాదం జరిగింది. ప్రధానంగా పెట్రోల్ బంకులో షిఫ్టల ప్రకారం విధులను నిర్వహించేందుకు కొందరు సిబ్బంది పోటీ పడుతుంటారు. ఎప్పటికీ సంవత్సరాల తరబడి విధులను కొందరికే కేటాయిస్తారా? అనే అంశంపై ఉద్యోగులలో పోటీపెరిగి వారు వాగ్వాదం చేసుకున్నారు. ఈ విషయాన్ని అక్కడికి వచ్చిన జడ్జిలకు పలుమార్లు ఖైదీలు ఫిర్యాదులు కూడా చేసినట్లు సమాచారం. ఈ విషయంపై కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావును వివరణ కోరగా ఎలాంటి వాగ్వాదం జరగలేదని తెలిపారు.

ఒంటరితనంతో వ్యక్తి ఆత్మహత్య

కురబలకోట : ఒంటరితనం.. ఆపై అనారోగ్యం భరించలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కురబలకోట మండలం, ముద్రవారిపల్లెకు చెందిన బి.రవీంద్ర (62)కు ఆరేళ్ల క్రితం భార్య చనిపోయింది. ఇతనికి ముగ్గురు ఆడపిల్లలు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. ఆ తర్వాత ఇతను కడప క్రాస్ వద్ద బాడుగ ఇంట్లో ఉంటూ టమాటా సాగుకు కట్టెలు నాటేందుకు వెళ్లడం ఇతర కూలి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఒంటరితనంతో బాధపడేవాడు. దీంతో అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో కొక్కికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం స్థానికులు కనుగొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి పెద్ద కుమార్తె రెడ్డెమ్మ తన తండ్రి ఒంటరితనం ఆపై అనారోగ్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఫిర్యాదు చేశారు.

విద్యార్థి జీవితంలో గురువు పాత్ర ప్రధానం

- ప్రభుత్వ విప్ ఆర్. మాధవి
- కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు



కోటిరెడ్డి కళాశాల స్వర్ణోత్సవ వేడుకలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆర్. మాధవి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కార్పొరేషన్ : ప్రతి విద్యార్థి జీవితంలో గురువు పాత్ర అత్యంత ప్రధానమైనదని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి అన్నారు. శనివారం కోటిరెడ్డి ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవి, వైవీయూ ఉప కులపతి ప్రొఫెసర్ క్రిష్టారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. వి. సలీం బాషాలు హాజరై వేడుకలకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. తర్వాత కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల కంటే గురువు పాత్ర చాలా ప్రధానమైనదన్నారు. గురువు అందించే విజ్ఞానంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ముఖ్యంగా మహిళలు బహుళ నైపుణ్యం గల వ్యక్తులన్నారు. మహిళా ఉద్యోగులు ఇంటిపని, ఆఫీసు పనితో ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. మహిళలకు తగిన విశ్రాంతి, రక్షణ, మహిళాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు, అవకాశాలు అవసరమన్నారు. వైవీయూ ఉపకులపతి ప్రొఫెసర్ క్రిష్టారెడ్డి మాట్లాడుతూ మహిళల బాధ్యతాయుతమైన విధుల వల్ల వారి కుటుంబ సభ్యులకు గౌరవం పెరుగుతుందని, ప్రతి బిడ్డకు తన తల్లే ప్రథమ ఉపాధ్యాయురాలన్నారు. భారతదేశంలో మహిళలకు మొదటి నుంచి సమున్నత స్థానం ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మహిళలకు మరిన్ని ఉన్నత అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి విద్యార్థి తన గురువు మాటలను గౌరవించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఓ. విజయలక్ష్మి, విశ్రాంత రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పూర్వ ప్రధానాచార్యులు సంజీవమ్మ, ప్రేమలత, రాజమ్మ, రంగారెడ్డి ,డాక్టర్.బీఆర్ శైలజ, చరిత్ర అధ్యాపకురాలు రజియా సుల్తానా, అర్థశాస్త్ర అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివపార్వతి, పూర్వ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ స్వర్ణోత్సవాల వేడుకలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు అందరూ ఎంతో ఆనందంతో తమ పూర్వ అనుభవాలను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు, గీతాలు అలరించాయి. ఈ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైన ప్రముఖులందరినీ కళాశాల ప్రిన్సిపల్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

విద్యతోపాటు క్రీడల్లోను రాణించాలి

వైవీయూ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు : విద్యార్థులు విద్యతోపాటు క్రీడా పోటీల్లో కూడా రాణించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం యోగివేమన యూనివర్సిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజియేట్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని తెలిపారు. నేటి కాలంలో ఆరోగ్యమే మహాభాగ్యం అన్న విషయాన్ని అందరూ గుర్తెరగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీలు జరుగుతున్నాయన్నారు.

ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

కడప ప్రభుత్వ పురుషుల కాలేజీ, రాయలసీమ వ్యాయామ విద్య కాలేజీ, బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజీ, నారాయణమ్మ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, లక్ష్మీశ్రీనివాస డిగ్రీ కాలేజీ, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ, వైవీయూ, సాయి డిగ్రీ కాలేజీ, సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ డిగ్రీ కాలేజీ జట్ల క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలను యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ప్రశంసాపత్రం, మెమెంటో, ద్వితీయ బహుమతి రూ.3వేలు, ప్రశంసాపత్రం, మెమెంటో అందించనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఆచార్య కేవీ రమణయ్య, ఆచార్య నాగరాజు, పీడీ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

- జాతీయ రహదారిపై బస్సు, బైకు ఢీ
- రోడ్డు ప్రమాదంలో స్నేహితులు దుర్మరణం
- విషాదం నింపిన పుట్టినరోజు వేడుక





సంఘటన స్థలంలో బన్నీనాథరెడ్డి, శ్రీకిరణ్ మృతదేహాలు



బన్నీనాథరెడ్డి(ఫైల్)



శ్రీకిరణ్(ఫైల్)

రాజంపేట : కడప– రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. పుట్టిన రోజు వేడుక జరుపుకున్న కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు యువకులు మృత్యువాత పడటం అందరినీ కలచి వేసింది. వివరాలు ఇలా.. నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన శ్రీకిరణ్ (20), వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం ఇప్పెంట్ల గ్రామానికి చెందిన బన్నీనాథ్‌రెడ్డి ఉరఫ్ బన్నీ(21) ఇంటర్ చదివే సమయంలో మంచి స్నేహితులు. ప్రస్తుతం బన్నీ చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్, కిరణ్ రాజంపేట మండలం బోయనపల్లె వద్ద ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకెండ్ ఇయర్ చదువుతున్నారు. కిరణ్ పుట్టినరోజు కావడంతో శుక్రవారం రాత్రి బన్నీ చెన్నై నుంచి రాజంపేటకు వచ్చాడు. శనివారం పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ఇద్దరూ బోయనపల్లె నుంచి బైకులో రాజంపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని బోయనపల్లె వద్ద రాజంపేట నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరి స్నేహం మరణంలో కూడా విడిపోలేదు.

రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు

స్నేహితులు కిరణ్, బన్నీలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన వారి కుటుంబాల్లో విషాద ఛాయలను నింపింది. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు స్నేహితుల మృతి సంఘటనను ఇంజినీరింగ్ విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు సీఐ ఎస్ఎండీ అలీ తెలిపారు.

వృద్ధులపై దాడి ఘటన.. కేసు నమోదు

గుర్రంకొండ : మండలంలోని మర్రిమాకులపల్లె గ్రామంలో వృద్ధులపై దాడి చేసిన సంఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్‌రెడ్డి గత రాత్రి మద్యం మత్తులో గ్రామానికి చెందిన ఆరుగురు వృద్ధులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో వృద్ధులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కె.వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇప్పటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

పింఛా ప్రాజెక్టును సందర్శించిన సబ్ కలెక్టర్

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టును రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిని, ప్రాజెక్టులో ఇప్పటివరకు జరిగిన పనులను, చేయవలసిన పనుల వివరాలను జల వనరులశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రాజెక్టుకు వచ్చే జల వనరులు, ప్రాజెక్టుకు దిగువన ఉండే జలవనరులను గుర్తించి మ్యాప్‌ను సమర్పించాల్సిందిగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర నాయక్‌కు సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరామయ్య మాట్లాడుతూ మత్స్యశాఖ వారితో మాట్లాడి డ్యామ్‌లో చేపలను వదిలే ఆలోచన కూడా ఉందని సబ్ కలెక్టర్‌కు తెలిపారు.

లోక్ అదాలత్ ద్వారానే కేసులకు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి
- జిల్లా వ్యాప్తంగా 20 బెంచీల ద్వారా 6553 కేసులకు పరిష్కారం
- కక్షిదారులకు నష్టపరిహారం రూ. 6,72,21,635లు చెల్లింపు



బాధితులకు నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్ ద్వారానే కేసులకు పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 20 బెంచీలను ఏర్పాటు చేసుకుని ఆయా కోర్టులకు సంబంధించిన న్యాయమూర్తులు కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాలుగవ జిల్లా న్యాయమూర్తి జి. దీనబాబు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి, ఎక్సైజ్‌కోర్టు న్యాయమూర్తి జె.హేమస్రవంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. నందిని, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

■ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6553 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా కక్షిదారులకు రూ.6,72,21,635లను చెల్లించారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు లోక్ అదాలత్ కొనసాగింది.

■ మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఎంవీఓపీ నెంబర్: 318/2024 కేసులో రూ. 83 లక్షలు మొత్తానికి వాది అయిన శ్రావణి, ప్రతివాది అయిన చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఏ. రవీంద్రారెడ్డి, ప్రతి వాది తరపు న్యాయవాది డి. రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఎంవీఓపీ నంబర్:171/ 2022 కేసులో రూ. 32 లక్షలు మొత్తాన్ని కందు జ్యోతి, ప్రతివాది బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ వారు జాతీయలోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ అయ్యారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఆర్. చంద్రబాబురెడ్డి, ప్రతివాది తరపున న్యాయవాదులు డి. రాజశేఖర్‌రెడ్డి, ఎస్. ప్రవీణ్‌కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

కూటమి నేతల కనుసన్నల్లో అధికార యంత్రాంగం

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : జమ్మలమడుగు నియోజకవర్గంలో దేవగుడి రాజ్యాంగం నడుస్తోంది. పోలీసు వ్యవస్థతోపాటు రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ, కింది స్థాయి సిబ్బంది అందరూ ఎన్‌డీఏ కూటమి నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు.. అని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామంలో జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికల్లో తమ గ్రామానికి సంబంధించిన నాలుగు టీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు రైతులకు నోడ్యూస్ సర్టిఫికెట్లు అధికారులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వీఆర్‌ఓలు, తహసీల్దార్‌లను ప్రైవేట్ వాహనాల్లో ఎత్తుకు పోయారని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తోపాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారులు రాజ్యాంగ బద్ధమైన హోదాలను అనుభవిస్తూ ఎమ్మెల్యే, ఎన్‌డీఏ కూటమి నాయకుల కనుసన్నల్లో ఉద్యోగాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వీఆర్‌ఓలను దేవగుడి గ్రామానికి తీసుకుని వెళ్లి అక్కడ బంధించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే కూటమి నాయకులకు పరాభవం తప్పదనే భయంతోనే ఏకపక్షంగా వ్యవహరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, దౌర్జన్యాలు చేసినా తాము ఏమాత్రం అధైర్యపడకుండా ప్రజలకు, రైతులకు అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు.